నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
3 | నిజామాబాద్, శనివారం 13 జనవరి 2024 | ADILABAD

ఫంక్షన్ హాల్ సీజ్

ఫంక్షన్ హాల్‌కు సీల్ వేస్తున్న అధికారులు

పేరుకుపోయిన రూ.12.09 లక్షల బకాయి

నిర్మల్ అర్బన్, జనవరి 12: పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌లో ఉన్న స్టార్ ఫంక్షన్ హాల్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఫంక్షన్ హాలుకు బకాయిలు రూ.12,09,041 ఉండడం, చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శుక్రవారం రెవెన్యూ అధికారి గంగాధర్ సీలు వేశారు. పన్ను చెల్లించేదాక సీలును తొలగించేది లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, షాకీర్ ఖాన్, బిల్ కలెక్టర్ భరత్, లక్ష్మణ్ తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 12: జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ డా. వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన సాయివిపుల్, రామకృష్ణాచారి, ఫసియుద్దీన్, అనిరుధ్, శ్రేయాంక్, హర్షిత్, అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తరాఖండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

వివేకానంద విగ్రహానికి పూలమలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం,జనవరి 12: స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతరాన్ని ఉత్తేజపరిచి లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించవద్దన్నారు. 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతీ యువకులు, అధికారులతో ఓటు హక్కు నమోదుపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతికి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపన్యాస పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను ప్రదానం చేశారు. అనంతరం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీపీఆర్వో విష్ణువర్ధన్, కళాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారులున్నారు.

ఎఫ్‌సీఐ పాయింట్ ప్రారంభం

ఎదులాపురం,జనవరి 12: సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలో రైస్‌మిల్లర్ల కోసం 8వేల మెట్రిక్ టన్నుల ఎఫ్‌సీఐ పాయింట్‌ను శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. అనంతరం గోదాంలను పరిశీలించారు. డీఎస్‌వో కిరణ్ కుమార్, అధికారులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం వీడాలి

మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్(బేల), జనవరి 12: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇస్తానన్న హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం వీడాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. బేల మండలంలోని జూనోని గ్రామంలో శుక్రవారం కుమ్రం భీం విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కుమ్రం భీం చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో కలిసి భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోగు రామన్నను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, గంభీర్ ఠాక్రే, సతీశ్ పవార్, దేవన్న, సునీల్, కుమ్ర రాజు, గోదురు భూమన్న, చరణ్, మైతం దత్తు, అరుణ్, విప్పిన్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ పాల్గొన్నారు.

నిర్మల్‌లో దారుణం

- మామాఅల్లుళ్లపై మారణాయుధాలతో దాడి
- మామ మృతి.. ప్రాణాపాయ స్థితిలో అల్లుడు

బుచ్చన్న(ఫైల్)

నిర్మల్ అర్బన్, జనవరి 12: నిర్మల్ జిల్లా లో శుక్రవారం దారుణం చోటు చేసుకుంది. మామాఅల్లుడిపై గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో మామ మృతి చెందగా, అల్లుడి పరిస్థితి విషమంగా ఉంది. నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామానికి చెందిన పోలీస్ బుచ్చన్న తన అల్లుడు వెంకటేశ్‌తో కలిసి నిర్మల్‌లో దవాఖానకు వెళ్లి, తిరిగి గ్రామానికి వస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బంగల్‌పేట్ జంగల్ హనుమాన్ వద్ద బైక్‌పై వెళ్తున్న వీరిపై గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారు. పోలీస్ బుచ్చన్న(55) ముఖంపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లుడు వెంకటేశ్ కడుపుపై దాడి చేయడంతో పేగులు బయటపడి, ప్రాణాపాయ స్థితి లో ఉన్నాడు. స్థానికులు ఆయనను 108లో జిల్లా దవాఖానకు తరలించారు. వెంకటేశ్ పరిస్థితి విషమంగా ఉంది. పోలీస్ బుచ్చన్నకు భార్య, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ జిల్లా దవాఖానకు చేరుకొని వెంకటేశ్‌తో మాట్లాడారు. బుచ్చన్న కొడుకుల్లో ఒకరు గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు సమాచారం. ఈ కక్షలతోనే హత్య జరిగినట్లుగా అనుమానిస్తున్నారు. కాగా, పోలీసుల అదుపులో ఇద్దరు ఉన్నట్లు సమాచారం.

ఎద్దును చంపిందనే పులి హతం

విషప్రయోగం చేసినట్లు విచారణలో ఒప్పుకున్న ముగ్గురు

- ఇద్దరికి 12 రోజుల జుడీషియల్ కస్టడీ, పేరెంటల్ బాండ్‌పై మైనర్ బాలుడి విడుదల
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎఫ్‌వో
- టైగర్స్ ఆచూకీ కోసం అడవుల్లో కొనసాగుతున్న ఆపరేషన్
- త్వరలో అంతర్రాష్ట్ర సమావేశం.. సంరక్షణపై చర్చ

విష ప్రయోగంలో మృతి చెందిన మగపులిని దహనం చేస్తున్న అధికారులు (ఫైల్)

మంచిర్యాల, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాగజ్‌నగర్‌లో పులి మృతి చెందిన ఘటనపై ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమ ఎద్దును చంపిందన్న కోపంతోనే విషప్రయోగం చేసి పులిని హతమార్చినట్లు విచారణలో ముగ్గురు అంగీకరించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రెస్‌నోట్ విడుదల చేయడంతో పాటు ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టేబ్రీవాల్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆసిఫాబాద్ డివిజన్ వాంకిడి మండలం వెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెంగరీట్ గ్రామానికి చెందిన కోవా గంగు, ఆత్రం జల్‌పతితో పాటు 11 ఏళ్ల బాలుడు విషప్రయోగం చేసిన వారిలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలతో సహా నిందితులను కోర్టులో హాజరుపరచగా, గంగు, జల్‌పతికి 12 రోజుల జుడీషియల్ కస్టడీని కోర్టు విధించిందని చెప్పారు. మైనర్‌ను పేరెంటల్ బాండ్‌పై రిలీజ్(అధికారుల విచారణ కోసం ఎప్పుడు పిలిచినా రావాలి, కోర్టు తుది తీర్పునకు కట్టుబడి ఉండాలి) చేసిందని తెలిపారు. రేపటి నుంచి తదుపరి విచారణకు రావాలని కోర్టు సూచించిందని, విచారణ పూర్తయ్యాక ఘటనకు బాధ్యులైన అటవీ శాఖ సిబ్బందిపైనా చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

మూడు రోజులుగా టెన్షన్

విషప్రయోగంతో మగ పులి ఎస్-9 మృతి చెందిన ఘటనలో అధికారులు ఈ నెల 10న కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. దరిగాం గ్రామంతో పాటు సర్కేపల్లి, రెంగరీట్ గ్రామాలకు చెందిన 6 నుంచి 8 మందిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. దీంతో గడిచిన మూడు రోజులుగా ఆయా గ్రామాల్లో టెన్షన్ నెలకొంది. అరెస్టు చేసిన తమ వారిని వదిలి పెట్టాలంటూ కాగజ్‌నగర్‌లోని అటవీశాఖ కార్యాలయం ఎదుట గురువారం గ్రామస్తులు ఆందోళన సైతం చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ముగ్గురిని కోర్టులో హాజరుపరచడంతో ఉత్కంఠకు తెరపడింది. మిగిలిన ఐదుగురిని ఇంటికి పంపేసినట్లు తెలిసింది. ఈ మూడు గ్రామాల నుంచి అనుమానితులను అదుపులోకి తీసుకున్న అధికారులు గురువారం ఆయా గ్రామాల్లో నూ విచారణ చేశారు. ఆధారాలు సేకరించే పనితో పాటు సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ సైతం చేశారు. కాగా విషం తిన్నట్లు అనుమానిస్తున్న మిగిలిన పులులతో పాటు, కనిపించకుండా పోయిన పులుల ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. మూడో రోజూ పులుల జాడ కోసం 120 మంది సిబ్బందితో కూడిన 24 బృందాలు అడవిలో జల్లెడ పట్టాయి. ఇప్పటి వరకు మూడు పులుల పాద ముద్రలను గుర్తించారు. కాకపోతే సదరు పులుల ఆచూకీ సీసీ కెమెరాల్లో గానీ, లైవ్ కెమెరాల్లో గానీ ఎక్కడా రికార్డు కాకపోవడంతో వెతుకులాట కొనసాగిస్తున్నారు. పులుల ఆచూకీ తెలిసే వరకు ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగేలా ఉంది. కాగా, ఈ నెల 6న చనిపోయిన పులి.. కొట్లాటలోనే మృతి చెందిందని అధికారులు చెబుతున్నారు. అయితే విషపూరితమైన ఆహారం తిని చనిపోయిందా.. కొట్లాటలో మృతి చెందిందా అన్న దానిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

త్వరలో అంతర్రాష్ట్ర సమావేశం..

కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో రెండు పులులు మృతి చెందిన ఘటనపై జనవరి మూడో వారంలో మహారాష్ట్ర, తెలంగాణ అటవీశాఖ అధికారుల మధ్య అంతర్రాష్ట్ర సమావేశం నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చారు. ఎన్‌టీసీఏ సూచనల మేరకు రెండు రాష్ట్రాల మధ్య పులుల ఆవాసాలు, కారిడార్‌ల పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహాలపై జాయింట్ మీటింగ్ ఉండనున్నది. అప్పటిలోగా పులుల అన్వేషణను ఒక కొలిక్కి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- నిర్మల్ జిల్లాలో 210 కేంద్రాల ద్వారా 1,43,072 మెట్రిక్ టన్నుల వడ్ల సేకరణ
- 34,154 మంది రైతుల నుంచి రూ.315 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు
- 28,613 మంది రైతుల ఖాతాల్లో రూ.263 కోట్లు జమ
- 5,541 మంది రైతులకు అందని రూ.52 కోట్లు

లక్ష్మణచాంద మండలం వడ్యాల్, రాచాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)

నిర్మల్, జనవరి 12(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో వానకాలానికి సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. 210 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,43,072 మెట్రిక్ టన్నుల(మె.ట.) ధాన్యాన్ని సేకరించారు. ఈ సీజన్‌లో 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తున్నదని అధికారులు అంచనా వేశారు. కాగా గ్రేడ్-ఏ రకం 1,35,072 మెట్రిక్ టన్నులు, సాధారణ రకం 7,500 మెట్రిక్ టన్నులు మొత్తం 1,43,072 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. 34,154 మంది అన్నదాతల నుంచి రూ.315 కోట్ల వడ్లను కొన్నారు. ఇందులో 28,613 మందికి రూ.263 కోట్ల చెల్లింపులు జరిపారు. ఇంకా.. 5,541 మంది కి రూ.52 కోట్లను చెల్లించాలి. రెండు, మూడు రోజుల్లో డబ్బులను జమ చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ వారం రోజులు దాటుతున్నా ఖాతాల్లో జమ కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాను మూడు సెక్టార్లుగా విభజించి, ఏ రోజు కొన్న ధాన్యాన్ని ఆ రోజునే కేంద్రాల నుంచి మిల్లులకు తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా.. గ్రేడ్ 'ఏ' రకం క్వింటాలుకు రూ.2,203.. సాధారణ రకం రూ.2,183 పెట్టి కొనుగోలు చేసింది. రెండు, మూడు రోజుల్లో మిగిలిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ కే.శ్రీకళ తెలిపారు.

సేకరించిన ధాన్యం..

సంస్థ	కేంద్రాలు	రైతులు	సేకరించిన ధాన్యం(మె.ట.)
డీసీఎమ్మెస్	80	12,674	60,70560
పీఏసీఎస్	95	16,048	64,295
డీఆర్‌డీఏ	30	4,828	15,926
జీసీసీ	05	604	2,145

పత్తి రైతుల పాట్లు

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో గందరోగళం

- పంట అమ్మకానికి వాహనాల బారులు
- సమాచారం లేకుండా కొనుగోళ్ల నిలిపివేత
- జిన్నింగ్‌లలో నిల్వల సాకుతో నిరాకరణ
- 8 గంటల పాటు పడిగాపులు
- ఆందోళనకు దిగిన రైతులు
- చర్చల తర్వాత కొనుగోళ్ల ప్రారంభం

మార్కెట్ యార్డులో నిలిచిపోయిన పత్తి వాహనాలు

ఆదిలాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో శుక్రవారం అధికారుల నిర్వాకం ఫలితంగా అన్నదాతలు అరిగోస పడాల్సి వచ్చింది. పండుగపూట ఖర్చుల కోసం రైతులు పెద్దసంఖ్యలో పత్తిని అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చారు. సంతోషంగా పంటను విక్రయించడానికి వచ్చిన రైతులు పంట కొనుగోళ్లు లేకపోవడంతో 8 గంటల పాటు పడిగాపులు కాశారు. మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరుగుతుండగా శుక్రవారం ఉదయం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో పత్తిని తీసుకువచ్చారు. సీసీఐ అధికారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పత్తిని బేళ్లుగా మార్చడానికి జిల్లా కేంద్రంలోని 18 జిన్నింగ్‌లను లీజుకు తీసుకున్నారు. ట్రక్కుల డ్రైవర్ల సమ్మె కారణంగా జిన్నింగ్ మిల్లులో పత్తి బేళ్ల రవాణా నిలిచిపోయిందని, నిల్వ చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో పత్తిని తేవద్దని వ్యాపారులు సూచించారు. దీంతో సీసీఐ అధికారులు కొనుగోళ్లను నిలిపివేశారు. అయితే అప్పటికే పత్తిలోడ్‌తో భారీ సంఖ్యలో వాహనాలు మార్కెట్‌యార్డు లోపల, బయట వచ్చి ఉన్నాయి. ఇక కొనుగోళ్ల నిలిపివేతను నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ముందుగా సమాచారమిస్తే పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేవాళ్లం కాదని అధికారులను నిలదీశారు. వెంటనే తెచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ ఉమేందర్ మార్కెట్ యార్డుకు చేరుకుని జిన్నింగ్ వ్యాపారులు, లారీల యజమానులతో చర్చలు జరిపారు. జిన్నింగ్‌లలో ఉన్న పత్తి బేళ్లను రవాణా చేయడానికి లారీ యజమానులు ఒప్పుకోవడంతో మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

తప్పని నిరీక్షణ

మార్కెట్‌యార్డుకు ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల నుంచి రైతులు వాహనాల్లో పత్తిని తీసుకువచ్చారు. ఉదయం 5 గంటల నుంచి వాహనాల రాక ప్రారంభంకాగా 10 గంటల వరకు 400 వరకు వాహనాలు వచ్చాయి. పత్తిలోడ్ వాహనాలతో మార్కెట్‌యార్డు పరిసర ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. అయితే కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. తాగునీరు, తిండి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వని అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పండుగపూట ఇదేం గోస

పండుగ పూట పత్తిని అమ్ముకొని వచ్చే పైసలతో సంక్రాంత్రిని మంచిగ చేసుకుందమని వస్తే అధికారుల నిర్వాకంతో గోస పడాల్సి వస్తున్నది. సీసీఐకి పత్తిని అమ్ముకుందమని ట్రాక్టర్‌లో 25 క్వింటాళ్ల వరకు పత్తిని తెచ్చిన. పొద్దున 7 గంటలకు వస్తే మధ్యాహ్నం 12.45 అయ్యింది. ఇంకా కాంటా ప్రారంభం కాలే. లారీలు వస్తలేవని బేళ్లు తీసుకుపోతలేరని వ్యాపారులు వాళ్ల జిన్నింగ్‌లకు పత్తి బండ్లను రానిస్తలేరు. ఈ సమాచారం ముందుగా రైతులకు తెలియజేస్తే పత్తిని తెచ్చేటోళ్లం కాదు. మూడు,నాలగు వందల మంది రైతులు గంటల నుంచి పత్తిని అమ్మికోవడానికి ఎదురుచూస్తున్నరు. అధికారులు గిట్ల చేసుడు మంచిది కాదు. *-దేవారెడ్డి, రైతు, పల్లి కే, తలమడుగు మండలం*

పొద్దున్నే వచ్చిన..

ఆదిలాబాద్‌కు మా గ్రామం 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నేను ట్రాక్టర్‌లో 22 క్వింటాళ్ల పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాను. తొందరగా కాంటా అవుతుందని ఉదయం 5 గంటలకే వచ్చిన. ఇక్కడికి అచ్చినంక పత్తి కొంటలేరని అన్నరు. ఒంటి గంట వరకు ఎదురు చూడాల్సి వచ్చింది. అధికారులు ముందే చెబితే అసలు తెచ్చేటోళ్లం కాదు. గిట్ల మమ్మల్ని ఇబ్బంది పెట్టుడు సరికాదు.

- ప్రకాశ్, రైతు, కాప్సి, బేల మండలం

ముందే చెబితే మంచిగుండు..

మార్కెట్‌యార్డుకు తొందరగా వస్తే జల్లి కాంటా అవుతుందని పొద్దున 6 గంటలకే వచ్చిన. అయినా లాభం లేకుండా పోయింది. ఇక్కడ పత్తి కొనుగోళ్లు ఆపేసిన్రు. మధ్యాహ్నం ఒంటిగంట అవుతున్నది. తిండి, తిప్పలు లేకుండా పత్తి ఎప్పుడు కొంటరా అని ఎదురు చూస్తున్నం. నాతో పాటు మరో 400 మంది దాకా రైతులు పత్తితో వచ్చిన్రు. అధికారులు ముందుగాల్నే చెబితే మంచిగుండు. ఇప్పుడు ఎంతో ఇబ్బంది పడ్డం.

- అశోక్, రైతు, గూడ, జైనథ్ మండలం

పాఠశాలల ప్రగతికి పీఎంశ్రీ నిధులు

- ఉమ్మడి జిల్లాలో 42 స్కూళ్లకు రూ. 729 లక్షలు మంజూరు
- 27 అదనపు తరగతి గదులకు రూ. 364.50 లక్షలు
- 27 బడుల్లో అత్యాధునిక ప్రయోగశాలలకు రూ. 364.50 లక్షల కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన

మంచిర్యాల(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/మంచిర్యాల అర్బన్, జనవరి 12 : ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 15 పాఠశాలల్లో 27 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 364.50 లక్షలు, 27 ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సైన్స్ ల్యాబ్‌లకు రూ. 364.5 లక్షలు మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే క్రీడాస్థలం, తరగతి గదులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు, వసతులు, భౌతికపరమైన అంశాలపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

27 పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లకు రూ. 364.5 లక్షలు

సైన్స్ ల్యాబ్‌ల కోసం పాఠశాలకు రూ. 13.50 లక్షల చొప్పున కేటాయించారు. ఉమ్మడి జిల్లాలోని 27 పాఠశాలలకు రూ. 364.50 లక్షలు మంజూరయ్యాయి. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలుర), చెన్నూర్ ప్రభుత్వ హైస్కూల్, దండేపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్, కోటపల్లిలోని దేవులవాడ జడ్పీహెచ్‌ఎస్, మంచిర్యాలలోని మోడల్ స్కూల్, మందమర్రిలోని మోడల్ స్కూల్, తాండూరులోని రేచి ని జడ్పీహెచ్‌ఎస్, వేమనపల్లిలోని నీల్వాయి జడ్పీహెచ్‌ఎస్‌లకు రూ. 108 లక్షలు మంజూరయ్యాయి. అలాగే ఆదిలాబాద్ రూరల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ యాపల్‌గూడ, గుడిహత్నూర్ మోడల్ స్కూల్, ఇంద్రవెల్లిలోని జడ్పీహెచ్‌ఎస్(బీ), ఉట్నూర్‌లోని టీడబ్ల్యూ ఆశ్రమ్ హైస్కూల్(బాలికల)లకు రూ. 54 లక్షలు, నిర్మల్ జిల్లాలోని బాసర జడ్పీహెచ్‌ఎస్, భైంసాలోని దీగాం జడ్పీహెచ్‌ఎస్, దస్తూరాబాద్ కేజీబీవీ, దిలావర్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్, కడెంపెద్దూర్‌లోని నచ్చన్ ఎల్లాపూర్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలికల), లక్ష్మణచాంద జడ్పీహెచ్‌ఎస్, మామడలోని కొరటికల్ జడ్పీహెచ్‌ఎస్, ముథోల్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలుర), నిర్మల్ రూరల్‌లోని ఈద్‌గాం టీఎస్ ఆశ్రమ్ హైస్కూల్(బాలుర), సారంగపూర్‌లోని దిపిప్‌జాం టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(బాలికల), సోన్‌లోని లెప్ట్ పోచంపాడ్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జూనియర్ కళాశాల(బాలికల)లకు రూ. 148.50 లక్షలు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్ బాబానగర్, కాగజ్‌నగర్‌లోని పాత ప్రభుత్వ హైస్కూల్ (తెలుగు, ఉర్దూ), పెంచికల్‌పేట జడ్పీహెచ్‌ఎస్, సిర్పూర్(యూ) మోడల్ స్కూల్‌లకు రూ. 54 లక్షలు మంజూరయ్యాయి.

27 అదనపు తరగతి గదులకు రూ. 364.50 లక్షలు

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో అదనపు తరగతి గదుల కోసం ఒక్కో గదికి రూ. 13.50 లక్షల చొప్పున 15 పాఠశాలల్లో 27 అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 364.50 లక్షలు మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లాలోని భీమారం జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక గది నిర్మాణానికి రూ. 13.50 లక్షలు, నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 13.50 లక్షలు, తాండూరులోని రేచిని జడ్పీహెచ్‌ఎస్‌లో మూడు గదులకు రూ. 40.50 లక్షలు, వేమనపల్లిలోని నీల్వాయి జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక గదికి రూ. 13.50 లక్షల చొప్పున నాలుగు పాఠశాలల్లో ఆరు గదులకు రూ.81లక్షలు మంజూరయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్ యాపల్‌గూడ జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక గదికి రూ. 13.50 లక్షలు, తాంసీలోని కప్పర్ల జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక గదికి రూ. 13.50 లక్ష ల చొప్పున రెండు పాఠశాలల్లో రెండు గదులకు రూ. 27 లక్షలు మంజూరయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లిలోని బాబాసాగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 13.50 లక్షలు, కాగజ్‌నగర్‌లోని నజ్రూల్‌నగర్ ప్రభుత్వ హైస్కూల్‌కు రూ. 13.50 లక్షలు, కెరమెరిలోని సావర్‌ఖేడ ఎంపీపీఎస్‌లో ఒక గదికి రూ. 13.50 లక్షలు, పెంచికల్‌పేటలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక గదికి రూ. 13.50 లక్షలు, వాంకిడిలోని కేజీబీవీలో ఐదు గదులకు రూ. 67.50 లక్షల చొప్పున ఐదు పాఠశాలల్లో తొమ్మిది గదులకు రూ. 121.50 లక్షలు మంజూరయ్యాయి. నిర్మల్ జిల్లా భైంసాలోని దహెగాం జడ్పీహెచ్‌ఎస్‌కు ఒక గదికి రూ. 13.50 లక్షలు, దస్తూరాబాద్ కేజీబీవీలో ఐదు గదులకు రూ. 67.50 లక్షలు, దిలావర్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఒక గదికి రూ. 13.50 లక్షలు, నిర్మల్‌లోని జుమ్మెరాత్‌పేట ప్రభుత్వ హైస్కూల్‌లో మూడు గదుల నిర్మాణానికి రూ. 40.50 లక్షల చొప్పున నాలుగు పాఠశాలలకు 10 అదనపు గదుల నిర్మాణానికి రూ. 135 లక్షలు మంజూరయ్యాయి.

హార్దిక శుభాకాంక్షలు...
గా॥ రామారావు పటేల్ గారు
శాసనసభ్యులు, ముధోల్
ఎం.డి.అబ్దుల్ రజాక్
ఎంపీపీ, భైంసా మండలం
వి.సర్వారెడ్డి
వైస్ ఎంపీపీ, భైంసా మండలం
స్నేహశీలి మృదుస్వభావి, కార్యాదీక్షాపరులు ఏకగ్ర